# * ముసలి రాకాసి *

ఏదిఏమైనా యుద్ధంఅనేది జరుగుతూందని ముసలమ్మ — వాంగ్ భార్యకు తెలుసు. ఆ మాటకొస్తే, చాలా కాలం కిందటే అందరికీ తెలుసు— యుద్ధం జరుగుతూందని, జపాను వాళ్ళు చైనా వాళ్ళని చంపుతున్నారనీనూ. ఐనా వాంగ్ కుటుంబంలో వాళ్ళెవరూ ఇంత వరకూ యుద్ధంలో చనిపోలేదు కనుక అది ఉత్త మాటకిందే జమ. మూడుమైళ్ళపసుపునదీ తీరాన్ని ఆక్రమించుకున్న ఆ వాంగ్ వాళ్ళ ఊళ్ళో— ఆ ఊరికి ఇంతకుముందు పెద్దగా చలామణీ ఐన వాంగ్ కానీ, వాళ్ళ వంశంతోనే నిండిన ఆ ఊరి వాళ్లు కానీ ఎవ్వరూ జపాను వాణ్ని చూడనైనా లేదు. ఐనా, వాళ్ళు-జపాను వాడు అనేవాణ్ని గురించి మాట్లాడు కోవటం ఈ యుద్ధం వలనే. లేకపోతే, వాళ్ళు ఆ మాటకూడా విని ఉండేవాళ్ళు కాదు.

అప్పుడే వేసవి తొంగి చూస్తోంది. సాయంత్రం భోజనం ముగించుకుని ముసలమ్మ వాంగ్ మెల్లగా పసుపునదికి కట్టిన చెలియలి కట్టమెట్లు ఎక్కసాగింది రోజూలాగే నదిమట్టం చూసేందుకు. ఆ ముసలమ్మను జపాను వాడికంటే ఈ నది ఎక్కువ భయపెడుతోంది. ఆనది ఏం చేస్తుందో ఆమెకు తెలుసు. ఆమె వెనకాలే ఊరి వాళ్ళంతా ఒకరి వెనకాల మరొకరు కట్టపై కెక్కి, ఆపాడు పసుపు నీళ్ళని చూస్తుండిపోయారు. సుళ్లు తిరుగుతున్న నీళ్లు. వాళ్ళ కళ్ళకు ఆ కట్టను కాటేయడానికి పరుగెత్తుకొస్తున్న పాముల్లాగా కనిపిస్తున్నాయి.

"నదిమట్టం ఇంత ముందుగానే పెరగటం నేనింతవరకూ చూళ్ళేదు"-అంది ముసలమ్మ వాంగ్-మనుమడు చిన్నపిగ్ తెచ్చిన వెదురు పీట మీద కూర్చుని నీళ్ళలోకి ఉమ్మేస్తు.

"ఈ ముసలిరాక్షసి నది, ఇది జపాను వాడికంటే కసాయిది"— కోపంగా అన్నాడు చిన్నపిగ్.

'వెధవా'- వెంటనే అంది ముసలి వాంగ్- "నీటి దేవుడు వింటాడు. మళ్ళీ ఎప్పుడూ అలా మాట్లాడకు"

ఆ మాటతో వాళ్ళసంభాషణ జపాను వాడిమీదకి మళ్ళింది తలా ఒకటి మాట్లాడారు. వాంగ్ భార్య వేలువిడిచిన మేనల్లుడికి ఓ సందేహం వచ్చింది- "ఒకవేళ జపానువాడు కనిపిస్తే వాణ్ని గుర్తుపట్టవచ్చా?"

ఈ సందేహానికి ఆ ముసలమ్మ తిరుగులేని సమాధానం లాగా చెప్పింది

"భేషుగ్గా గుర్తుపట్టొచ్చు ఓ సారి నేనో పరదేశిని చూశాను మన ఇంటి

మూలకథ: పెర్ల్. ఎస్. బక్

గుమ్మం కంటే పొడుగ్గా ఉన్నాడు వాడు, బురదరంగు వెంట్రుకలు, చేప కళ్ళు లాంటి కళ్లు, చూడగానే ఎవరైనా చెప్పొచ్చు- మనలాగా వుండని ఏ వెధవైనా జపాను వాడేనని"

ఆమె చెప్పింది శ్రద్ధగా విన్నారు అందరూ. ఊరికంతా పెద్ద దిక్కు కావటం వల్ల, ఆమె ఏదైనా చెబితే, సాధారణంగా దానికి తిరుగుండదు.

కానీ చిన్నపిగ్ తన అలవాటు కొద్దీ దీన్ని కూడా ఒప్పుకోకుండా, "బామ్మా, వాళ్లు మనకు కనిపించరు ఆకాశంలో గాలిమోటారులో దాక్కుంటారు" అన్నాడు. ముసలివాంగ్ వెంటనే ఏమీ బదులు చెప్పలేదు "నా కళ్ళతో నేను చూసేవరకూ గాలిమోటర్ అనేదాన్ని నేను నమ్మను" అని ఖచ్చితంగా అనేదే ఇది వరకైతే, కానీ ఆమె నమ్మకంతో పనిలేకుండా చాలా జరిగిపోయాయి మాటవరసకు మహారాణి చనిపోయిందంటే ఆమె నమ్మలేదు. కానీ ఆమె చచ్చిపోయింది అట్లాగే, ఆ ముసలమ్మ రిపబ్లిక్ రాజ్యాన్ని కూడా నమ్మలేదు నిజానికి అందుక్కారణం అసలు అదేమిటో ఆమెకు తెలియదు ఇంకా రిపబ్లిక్ అంటే ఏమిటో ఆమెకు తెలియదు కానీ, అలాంటిదేదో ఉందని చాలా కాలం నుండీ అందరూ అనుకోవటం వింటూనే వుంది. అందుకని, మౌనంగా ఉండిపోయింది అంతా కూర్చుని ఉన్న ఆ చెలియలి కట్టని నిశ్చలంగా చూస్తూ. నది చాలా ప్రశాంతంగా, హాయి గొలుపుతూ వుండటంతో, వరదలు రాకపోతే, ఆ పెరిగిన మట్టం వల్ల ప్రమాదం ఏమీలేదని నిశ్చయించుకుంది

"జపానువాడు అనేదాన్ని నేను నమ్మను" అంది నాఫీగా.

ఆ మాటకు అంతా నవ్వుకున్నా ఎవరూ ఏమీ మాట్లాడలేదు ఆ ముసలమ్మ మీద అభిమానం వున్న చిన్నపిగ్ భార్య చిలుంగొట్టం వెలిగించింది దాన్ని పీలుస్తుండి పోయింది ముసలివాంగ్.

"చిన్నపిగ్, ఓ పాట పాడు" అన్నారెవరో

. గొంతెత్తి ఒక పాత పాట మొదలెట్టాడు చిన్నపిగ్. ఆ పాట వినడంతో ముసలివాంగ్ జపాను వాణ్ని మరిచిపోయింది చల్లని సాయం సమయం ఆకాశం నీలంగా వుంది. కట్టమీద వున్న విల్లో చెట్లు చిక్కటి నీళ్ళల్లో కూడా స్పష్టంగా ప్రతిబింబిస్తున్నాయి. అంతా ప్రశాంతంగా వుంది ఆ ప్రశాంతిని భగ్నం చేసే శక్తి దేనికీ లేదు. ఒక మానవ మాత్రుడైన జపాను వాడెంత.

"ఈ గాలిమోటార్ల గురించి నాక్కొంచం అనుమానంగానే వుంది" అంది, ఆ ముసలమ్మ, చిన్నపిగ్ పాడటం ఆపగానే

కానీ ఆమెకు బదులియ్యకుండానే అతను మరో పాట అందుకున్నాడు. వేసవి సాయంకాలాలు అలా కట్టమీద గడటం ముసలివాంగ్‌కు అలవాటు. మొట్టమొదటిసారి అలా కట్టమీద కూర్చున్న

అనువాదం : వినయ్

ప్పుడు తనకు పదిహేడేళ్లు. అప్పుడు తను కొత్త పెళ్ళికూతురు. తన భర్త వాంగ్ *1 ఇంట్లోంచి బైటికెళ్ళి, కట్ట పైకి రమ్మని కేకేశాడు తనను చూసి మగవాళ్ళంతా అరుపులతో గోలచేసి, హాస్యం పట్టిస్తే, ఆడవాళ్ళ మధ్యకు వెళ్ళి దాగుండి పోయింది ఐతే వాళ్ళంద రికీ తను బాగా నచ్చింది. "జున్నుముక్క లాంటి పిల్ల" అన్నారందరూ, వాంగ్‌ను అభినందిస్తు "పాదాలు కాస్త మోటుగా వున్నాయి" అన్నాడు వాంగ్, తనను తక్కువ చేసినట్టుగా *2 కానీ అతనికి తను బాగా వచ్చిందని తను కనిపెట్ట గలిగింది. అంతటితో బెదరు, సిగ్గు పారి పోయాయి,

కానీ, పాపం ఆమరదృష్టవంతుడు పయసులో వుండగానే నీళ్ళలో, మునిగి చనిపోయాడు. బౌద్ధ సంప్రదాయాల ప్రకారం ఆతనికి స్వర్గ ప్రాప్తి కలిగించ టానికి ఆమెకు చాలా సంవత్సరాలు పట్టింది. అప్పటికీ ఏమీ కాలేదు. ఇంకా పది డాలర్లు ఖర్చుపెట్టాలని పూజారి అన్నప్పుడు- ఆమెకు తన కొడుకు, పొలమూ, బాధ్యతలూ గుర్తుకొచ్చి కాస్త విసుగొచ్చింది.

"పరిశుద్ధి చేయబడి, పాపకూపం లోంచి బైటపడటానికి ఇంకా ఎంత మిగి లున్నాడు" అంది.

"ఇక కుడిచెయ్యి ఒక్కటే" అన్నాడు పూజారి, ఆమెకు ఉత్సాహం కలిగించ డానికి ప్రయత్నిస్తు.

"ఒక్క చెయ్యి మాత్రమే ఐతే, ఆయన లాక్కోగండు" అన్నది నిశ్చ యంగా.

ఆ వెర్రిబాగులోడు వెళ్ళడా స్వర్గా నికి-అని ఆమె తరచుగా ఆశ్చర్య పడుతూ వుంటుంది. రాత్రిళ్ళు పడుకు న్నప్పుడు ఆమెకు అస్పష్టంగా వాంగ్ అక్కడే పడుకున్నట్టు తోచేది. తనను స్వర్గానికి పంపడానికి ఆమె చేయవలసిన కర్మకాండ కోసం వేచిచూస్తున్నట్టు అని పించేది. ఐతే, ఏదో ఒకరోజు బహుశా, చిన్నపిగ్ భార్య తొలిచూలు పండినరోజున ఆ ముసలమ్మ, వాంగ్ కర్మకాండ తప్ప కుండా పూర్తిచేస్తుంది.


"మామ్మా, చీకటి పడుతూంది. నువ్విక లోపలికెళ్ళు. నది మట్టంకూడా పెరుగుతూంది" అన్నది చిన్న పిగ్ భార్య వాంగ్‌తో.

"ఆఁఆఁ నేనూ అదే అనుకుంటు న్నాను" అని అన్నప్పటికే ఆమెలో

---

1. 'వాంగ్' అనేది మగపేరు. భార్యల్ని మగవారి పేరుతో 'మిసెస్'అని చేర్చి వాడటం ఆంగ్లసాహిత్యంలో మామూలే.

2. సిగ్గు వ్యక్తంచేయటం, పాదాలు దాచుకోవటం ద్వారా వ్యక్తం చేస్తారు చైనా స్త్రీలు. పాదాలు దాచుకోని స్త్రీని 'సిగ్గులేనిదాని'గా ఒప్పుకుంటారు. అందా నికి కూడా చిన్నగావున్న పాదాలని ఒక కొలమానంగా చైనీయులు పరిగ ణిస్తారు.




ఎంతమాత్రం తొందరపాటు కనిపించలేదు.

మంచి చెడులు కలిసి పోతున్నట్టుగా వున్న ఆ నదివైపు ఓ క్షణ పాటు చూసింది. అదుపులో వున్నప్పుడు అది పొలాల్ని తడుపుతుంది. అదేనది, అదుపు తప్పినప్పుడు పెనుభూతంలాగా పొంగి పొర్లుతుంది. తన భర్త, నిర్లక్ష్యంగా వుండి, అలాంటి సమయంలోనే నీళ్ళల్లో కొట్టుకుపోయాడు. ఎప్పుడూ ఆ కట్టు మార్పులు చేస్తూ, దాని ఎత్తును పెంచుతూ, ఎప్పుడూ ఆ కట్టమీదే వుండేవాడువాంగ్. చివరికి ఓ సారి, రాత్రి నది పొంగి కట్టను తెంచుకుని పారింది. అది చూడగానే వాంగ్ ఇంట్లోంచి బైటికి పరుగు తీశాడు. తను పిల్లాణ్ని ఎత్తుకుని,కప్పు మీదకి ఎక్కింది. అలా ఆయన ఏటి పాలయ్యాడు సరే, తరువాత, వాళ్లు నదిని అదుపు చేసి, కట్టను కట్టుదిట్టం చేశారు. రోజూ తను స్వయంగా కట్ట పైకెక్కి దాని పొడుగునా నడిచి పరీక్షించేది. నిజానికి అది ఊరి వాళ్ల బాధ్యత. వాళ్ళంతా నవ్వుకుంటూ "మళ్ళీ ఏమైనా జరిగినా, మన బామ్మ చెబుతుందిలే అనుకునే వాళ్లు.

ఆ ఊరిని నదికి దూరంగా జరపాలనే ఆలోచనే వాళ్లకెప్పుడూ రాలేదు. వాంగ్ వంశ అక్కడ తరతరాలుగా నివశిస్తూంది. తరువాత తరాలవాళ్ళు ఊహించలేనంతటి భయంకరమైన వరదల్ని చూశారు, తప్పించుకున్నారు. ఆ నదితో పోరాటం జరిపారు.

చిన్న పిగ్ ఒక్కసారిగా పాడటం ఆపి,

"చంద్రుడొస్తున్నాడు" అని అరిచాడు. "అలా రావటం మంచిది కాదు. వెన్నెల రాత్రిళ్ళు గాలి మోటార్లు బైటికొస్తాయి" అన్నాడు.

"ఈ గాలి మోటార్ల గురించి ఇవన్నీ నీ కెవడు, చెప్పింది?" అంది ముసలి వాంగ్ - "నాకు మాత్రం పెద్ద తల నొప్పిగా వుంది నీతో" అంది చికాగ్గా.

అందరూ మౌనంగా వుండిపోయారు. చిన్న పిగ్ భార్య మోచేయి పట్టుకుని, నిశ్శబ్దంగా కట్టమీదనుంచి దిగి, ఊళ్లోకి నడిచింది వాంగ్ భార్య. ఆమె వెనకాల మిగతా వాళ్లు ఒకరి వెనుక ఒకరు నెమ్మదిగా దిగి పడలకు చేరుకున్నారు ఆమె ఉండగా ఎవ్వరూ కదలక పోయినా, ఆమె వెళ్ళిన తరువాత మాత్రం ఎవ్వరూ ఉండలేదు.

ఆ ముసలమ్మ తన పడక మీదికి చేరుకుంది. చిన్న పిగ్ భార్య ఆ మంచానికి కట్టిన నీలి దోమ తెరల లోపల, ప్రశాంతంగా పడుకుంది. జపాను వాళ్ళు ఎందుకు పోట్లాడుతారా అని సతమతమవుతూ తాన్సేపు ఆలోచించింది. కసాయి మనుషులకు మాత్రమే యుద్ధాలంటే యిష్టమేమో. ఆమె ఊహలో భీకరంగా వున్న కరుకు మనుషులు కదిలారు. వాళ్లే వస్తే, వాళ్ళను సముదాయించాలి. వాళ్ళను టీకి పిలిచి, నేలను నమ్ముకుని ప్రశాంతంగా జీవిస్తున్న తమ ఊళ్లోకి వాళ్లు ఎందుకు రాకూడదో సకారణంగా వివరించాలి

ఆ ఆలోచనల్లో పడి, జపాను వాళ్లు వచ్చారన్న చిన్న పిగ్ భార్య మాటను పట్టించుకోలేదు. మెల్లిగా లేచి, "టీ ఇవ్వవే" అంది.

"సమయం లేదు మామ్మా. వాళ్లు వచ్చేశారు" అంది చిన్న పిగ్ భార్య

"ఎక్కడికి?" గట్టిగా అంది వాంగ్ భార్య, పూర్తిగా నిద్రమత్తు వదిలించుకుని.

"ఆకాశంలోకి"


అంతా బైటికి నడిచారు. పొద్దు పొడుస్తున్న నిర్మలమైన ఉషస్సమయం అది. ఆకాశంలోకి చూడ నారంభించారు. రాబందుల్లాగా తిరుగుతూన్న పక్షుల్లాంటి ఆకారాలు కనిపించాయి.

"ఏమిటవి?" అరిచిందా ముసలమ్మ.

ఆదే సమయంలో, తెల్ల వెండి గుడ్డు లాంటిదేదో ఊరికి ఆ చివరగా వున్న పొలంలో పడింది. పెద్దగా ధూళి ఆకాశంలోకి లేచింది. అంతా అక్కడికి పరుగుతీశారు. ముప్పై అడుగుల వెడల్పున్న చెరువులాంటి గొయ్యి కనిపించింది అందరూ దిగ్భ్రాంతితో నోరు మెదపలేకపోయారు. వాళ్లు ఆశ్చర్యం లోంచి తేరుకునేలోగానే ఆ వెండి గుడ్లు వరుసగా ఒకదాని వెనకొకటి పడటం ఆరంభించాయి. అందరూ తలా ఒక వైపు పరుగు లంకించుకున్నారు.

ఆ ముసలమ్మ వాంగ్ భార్య తప్ప అంతా పరుగు తీస్తున్నారు. చిన్న పిగ్ భార్య ఆమె చెయ్యి పట్టి లాగింది. కానీ, ఆ ముసలమ్మ చెయ్యి విదిలించుకుని, ఆ చెలియలి కట్టకు ఎదురుగా కింద కూచుండి పోయింది.

"పరిగెత్తటం నా వల్ల కాదు. పుట్టి బుద్ధెరిగి నప్పట్నుంచీ, ఈ డెబ్భైఏళ్లలో నేనెప్పుడూ పరిగెత్తలేదు. మీరువెళ్లండి" అంది. అటూ ఇటూ చూసి," చిన్న




"పిగ్ ఏడే?" అంది. అతనెప్పుడో వెళ్ళిపోయాడు. "వాళ్ల తాతలాగే, పరిగెత్తడంలో వాడు ఎప్పుడూ ముందే" అంది.

చిన్న పిగ్ భార్యకు ఆ ముసలమ్మను వదిలి వెళ్లటానికి మనసొప్పలేదు. కానీ పారిపోక తప్పదని ఆ ముసలమ్మ చెప్పినప్పుడు తప్పలేదు.

"చిన్నపిగ్‌కు ఏమన్నా ఐతే, కనీసం వాడి కొడుకన్నా బ్రతికుండాలి" అంది దూలుతో వున్న ఆ పిల్లను చూస్తూ అప్పటికీ కదలక పోవటంచూసి.

"వెళ్ళవే. తొందరపడు" అంది హెచ్చరికగా.

ఇష్టం లేకున్నా, విమానాల హోరులో ఒకరి మాటలు మరొకరికి వినిపించని కారణాన, మరేమీ మాట్లాడలేక, మిగతా వాళ్ళతో కలిసి వెళ్ళిపోయింది, చిన్న పిగ్ భార్య.

అంతా జరిగి కొద్ది నిమిషాలే ఐనా, అప్పటికి ఆ ఊరు పాడుపడిపోయినట్టయింది. విరిగిన దూలాలు, గోడల్లేని కప్పులు, శిథిలాలతో మిగిలి పోయింది. ఒక్కరూ లేకుండా అంతా వెళ్ళిపోయారు. వెళ్లేటప్పుడు అందరూ ఆ ముసలమ్మను రమ్మన్నప్పుడు, ఆమె సంతోషంతో___

"వస్తున్నా, వస్తున్నా" అంది వెనక నుంచి

కానీ ఆమె వెళ్లలేదు. తను ఎన్నడూ ఊహించి ఎరుగని ఆ ఊరి దృశ్యాన్ని చూస్తూండి పోయింది. నిశ్శబ్దంగా ఎక్కణ్ణించి వస్తున్నాయో అంతు పట్టకుండా మరిన్ని విమానాలు వచ్చి, మొదటి వాటి పైన దాడిచేశాయి. గోధుమ పంటమీదుగా సూర్యుడు ఎగబాకుతున్నాడు. ఆ నిర్మలమైన వేసవి వాతావరణంలో విమానాలు

ఒక దాంతో ఒకటి పోట్లాడుకున్నాయి. అదంతా ముగిసాక, మెల్లిగా ఊళ్లోకి వెళ్లి, ఏమైనా మిగిలిందేమో చూడాలనుకుంది. అక్కడొక్కటీ,ఇక్కడొకటీ, ఇళ్ళ కప్పులకు ఆసరాగా ఒకటి రెండు గోడలు నిలుచునున్నాయి. అక్కణ్నించి ఆమెకు తనఇల్లు కనిపించని యుద్ధం ఆమెకు తెలియందేమీ కాదు.ఒక సారి బందిపోటు దొంగలు వాళ్ళఊరిని కొల్లగొట్టి అప్పుడు కూడా ఇళ్ళు తగల బెట్టారు అదే ఇప్పుడు మళ్ళీ ఓ సారి జరిగింది. అంతే తగలబడే ఇళ్ళను ఎవరైనా చూసి ఉండవచ్చు కా ,ఆకాసంలో ఆ వెండి రాబందుల యుద్ధాన్ని మాత్రం ఎవరూ చూసి ఉండరు. అసలవి ఏమిటో, ఏ ఆధారం లేకుండా ఆకాశంలో ఎలా నిలబడ్డాయో ఆమెకు తెలియదు. పెరుగుతున్న ఆకలితో, చూస్తుండి పోయింది . అక్కడే కూచుని.

"కనీసం ఒకదాన్ని దగ్గర్నించి చూస్తే బావుణ్ణు" అంది పైకి. అవే క్షణంలో, ఆమెమాటకు జవాబులాగా, ఆ ఎగుతున్న వాటిలో ఒకటి కిందపడ నారంభించింది. రెక్కలు తెగిన పక్షి లాగా అది గాలిలో పల్టీలు కొడుతూ, అంతకు ముందు రోజే చిక్కుళ్ళ కోసం చిన్న పిగ్ దున్ని పెట్టిన పొలంలో పడి పోయింది. ఒక్కక్షణం తరువాత ఆకాశం బోసిగా, ఖాళీగా అయ్యింది. ఆదెబ్బ తిన్న లోహపక్షి, ఈ ముసలమ్మ తప్ప అక్కడ ఎవ్వరూలేరు.

మెల్లిగా లేచినిలుచుందా ముసలమ్మ. ఆ వయసులో ఆమెకు దేనికీ భయపడాల్సిన అవసరం లేదు. అక్కడికి వెళ్ళి, అదేమిటో చూడాలని నిశ్చయించుకుంది. అలా అనుకున్న వెంటనే, వెదురుకర్ర మీద వంగుతూ, పొలాల మధ్యగా దారి చేసుకుంటూ నడవ నారంభించింది. ఆ ఆకస్మిక నిస్తబ్దంలో, ఎక్కణ్నించో వచ్చిన రెండు మూడు కుక్కలు ఆమెతో నడవసాగాయి. పడిపోయిన విమానం దగ్గరకు వెళ్ళగానే, కుక్కలు మొరగడం ఆరంభించాయి, చేతికర్రతో వాటిని అదిలించింది.

"హుష్! అరవకండి. ఇప్పటికే నా చెవుల తుప్పు వదిలిపోయింది" అంది.

ఆ విమానాన్ని పరిశీలించ వారంభించింది.


"లోహమే" అంది కుక్కలతో మాట్లాడుతూ.

"వెండి. అనుమానం లేదు" మళ్ళీ అంది. కరిగిస్తే, దాంతో వాళ్ళంతా ఐశ్వర్యవంతులై పోతారు.

దగ్గరగా పరీక్షిస్తు, దాని చుట్టూ తిరిగింది. ఎట్లా ఎగిరింది ఆకాశంలో ఎలా నిలుచో గలిగింది? పాడై పోయినట్టుంది. లోపల ఎలాంటి కదలిక గానీ, శబ్దం గానీ లేదు అది తెరిచివున్న వైపుకు వెళ్ళి చూసింది ఒక పడుచు కుర్రాడు చిన్న సీటుకు అతుక్కుని కనిపించాడు. కుక్కలు మళ్ళీ తలెత్తాయి గానీ, మళ్ళీ అదిలించటంతో ఊరుకున్నాయి,

"ప్రాణం వుందా పోయిందా?" మర్యాదగా అడిగింది.

ఆమె మాటకు ఆ కుర్రాడు కొద్దిగా కదలాడు కానీ, ఏమీ మాట్లాడలేదు



మరింత దగ్గరికి వెళ్ళి, అతను ఉన్న స్థలంలోకి వంగి చూసింది. ఒకవైపు గాయంలోంచి రక్తం కారుతూంది.

"దెబ్బ తగిలినట్టుంది" అంది.

నాడి చేతిలోకి తీసుకుని చూసింది. వెచ్చగానే తగిలింది, కానీ నాడి అందటం లేదు ఆమె వదలగానే, ప్రాణం లేనట్టు పడిపోయిందతని చేయి. ఒక సారి పరిశీలనగా ఆ కుర్రాడివైపు చూసింది. నల్ల వెంట్రుకలూ, ముదురు చర్మమూ-చైనీలాగా ఉన్నా, చైనీలాగా అనిపించటం లేదు.

"దక్షిణాది వాడు అయ్యుండాలి" అనుకుంది. సరే, ఏమైనా అతను ప్రాణాలతో వున్నాడు. అది ముఖ్యమైంది.

"నువు బైటికొస్తే మంచిది. ఆ గాయానికి కొంచెం పసరు రాసి కట్టుకడతాను" అంది.

అతను ఏదో గొణిగాడు సన్నగా.

"ఏమంటుంటావూ?" అంది, అర్థం కాక. కానీ అతను ఏమీ పలకలేదు.

"నా ఒంట్లో ఇంకా సత్తువలేక పోలేదు" అనుకుంది ఓ నిశ్చయాని వస్తూ. లోపలికి వెళ్ళి, అతని రొమ్ము చుట్టూ ఓ చేయివేసి, మెల్లిగా బైటికి లాగింది. అదృష్టవశాత్తూ అతను పీల మనిషి, చాలా తేలికగా వున్నాడు. అతన్ని నేల మీదకు లాగినాక, అప్పుడే అతనికి తన కాళ్ళల్లో సత్తువ గుర్తొచ్చినట్టు, పఠుకుకూ లేచి నిలుచుని, ఆమె మీద ఒరిగాడు. అతను పడిపోకుండ పట్టుకుంది.

"ఇకనువ్వు నడిస్తే, మాయిల్లు వున్నదేమో చూసి, అక్కడికి వెళ్ళొచ్చు"

ఆమె మాటకు బదులుగా అతను చాలా స్పష్టంగా ఏదో అన్నాడు. ఆమె విన్నది కానీ అందులో ఒక్కమాటైనా అర్థం చేసుకోలేక పోయింది.

"ఏమిటి?" అని అడిగింది.

అతను కుక్కలవైపు చూపించాడు. వెనక కాళ్ళమీద లేచి, నిలబడి, అవి అతని మీద దాడి చేయబోతున్నట్టు చూస్తున్నాయి. అతను మళ్ళీ ఏదో అంటూ కింద పడ్డాడు. కుక్కలు అతని మీదకు ఉరకడంతో, ఆమె వాటిని చేత్తో గట్టిగా అదిలించింది.

"దూరంపొండి. అతన్ని చంపేపని మీకెవరు చెప్పారు?" అంది అరుస్తూ "మీకు" అన్న పదాన్ని వత్తి పలకుతూ.

కుక్కలు దూరంగా పోవటంతో, అతన్ని తన వీపు కానించుకుని తడబడుతున్న అడుగులతో, ఓ చేత్తో కర్ర మీద అనుకుని, అతన్ని సగం మోస్తు, సగం యీడుస్తు, ఊరివైపు దారితీసింది. అతన్ని ఓ వీధి దగ్గర వదిలేసి, కుక్కల్ని వెంట బెట్టుకుని, తన ఇంటి వైపు దారి తీసింది.

ఆమె యిల్లు పూర్తిగా మట్టిలో కలిసి పోయింది. ఆస్థలం సులభంగానే గుర్తుపట్ట గలిగింది.. కట్ట నీటి ద్వారానికి సరిగ్గా ఎదురుగా వుంటుందా ఇల్లు. ఆమె ఏప్పుడూ ఆ నీటి ద్వారాన్ని పరిశీలిస్తూ ఉండేది. ఏమాయో, మహత్తో జరిగినట్టు ఆనీటి ద్వారం మాత్రం చెక్కు చెదర లేదు. ఇల్లు కట్టుకోవడం పెద్ద పనికాదు. కాకపోతే ప్రస్తుతానికి ఇల్లనేది లేదు. అంతే.

ఇక వెనక్కి తిరిగి, ఆ కుర్రాడి దగ్గరికి వెళ్ళింది.

అతను అక్కడే, ఆమె ఎలా వదిలి వెళ్ళిందో అలాగే ఉన్నాడు. కట్టపక్కన పాలిపోయిన మొహంతో కోటు విప్పి అందులోంచి ఒక చిన్న సంచీలోని ఏదో సీసా బైటికి తీశాడు. ఏదో అన్నాడు మళ్ళీ. ఆమెకు ఏమీ అర్థం కాలేదు. అతను చేసిన సైగల్ని బట్టి, కట్ట నీళ్ళు డుగుతున్నాడని గ్రహించి, వీధిలో పగిలి పోయివున్న ఓ కుండ పెంకు తీసుకుని కట్టపైకెక్కి, నదిలోంచి నీళ్ళు తీసుకొచ్చి, అతని గాయం కడిగింది. అతను తీసిచ్చిన కట్టుగుడ్డను, అతను చేస్తున్న సైగలననుసరిస్తు, గాయానికి కట్టింది. అంతసేపూ అతను ఏదో చెప్పడానికి ప్రయత్నిస్తునే ఉన్నాడు కానీ ఆమెకు ఏమీ అర్థం కాలేదు.

"మీది దక్షిణాది అనుకుంటా" అంది. అతను చదువుకున్న వాడి లాగా చాలా చురుకయిన వాడి లాగానూ కనిపిస్తున్నాడు. "మీ భాష వేరని విన్నాను" అంది నవ్వుతూ, అతనితో కలుపుగోలుగా ఉండాలని కోరుతున్నట్టుగా. కానీ మగతగా, నీరసించిన కళ్ళతో ఓసారి ఆమె వైపు చూడటం మినహా అతను మరేమీ చేయలేదు.

"మనకేమైనా తినడానికి దొరుకుతుందేమో చూస్తాను" అంది ఉత్సాహంగా.

అతనేమీ బదులియ్యలేదు. వెనక్కి ఒరిగి, భారంగా ఒత్తిగిలి, ఆకాశంలోకి చూస్తుండి పోయాడు, ఆమె మాటలు విననట్టుగా.

"కాస్త ఎంగిలి పడితే నీకైనా నాకయినా మంచిది"— అంది వెళ్ళి



పోతూ. ఆమెకు భరించ లేనంత ఆకలిగా అనిపిస్తుంది.
రొట్టెల దుకాణంలో ఏమైనా రొట్టెలుండొచ్చునని తోచిందా మునెమ్మకు. దాని మీద దుమ్ము, ధూళి ఏదయినా పడి వున్నప్పటికీ, అది కడుపు నింపకపోదు. వెళ్ళిచూడాలి- అనుకుంది. వెళ్ళేముందు ఆ సిపాయిని కట్టపైన పెరిగిన చెట్టు నీడలోకి లాగింది. రొట్టెల దుకాణానికి దారి తీసింది. కుక్కలు ఆమెను అనుసరించాయి.

అన్నిటిలాగే రొట్టెల దుకాణంకూడా శిథిలమైపోయింది. ఒక్క పురుగు కూడా లేదక్కడ. కూలిపోయిన గోడలు తప్ప ఏమీ కనిపించ లేదు. అంతలోనే, ఓ వైపు కప్పుకి ఆధారంగా నిలబడిన ద్వారంలోపలే రొట్టెలు కాల్చే పెనం వుంటుందన్న విషయం గుర్తుకొచ్చింది. ఆ ద్వారంలో నిలబడి, వంగి పోయిన కప్పు కిందుగా చేతిని లోపలికి పోనిచ్చింది. కర్ర పెట్టె తగిలింది. దాని కిందనే కాల్చిన రొట్టెలుండాలి. చేతికి దుమ్మూ మట్టీ తగులుతున్నా అతి జాగ్రత్తగా లోపల తడిమి చూసింది. చివరకు, ఆమె వేళ్ళకు మెత్తగా తగిలింది రొట్టె. నాలుగు రొట్టెల్ని బయటికి తీసింది.

"నాలాంటి మొండిఘటం అంత సులభంగా చచ్చిపోదు" అనుకుంది తనకు తానే సంతోషంగా. వెనక్కి తిరిగి, ఒక రొట్టె తింటూ నడవసాగింది, ఓ వెల్లుల్లి పాయ, ఓ గ్లాసుడు టీ నీళ్ళు వుంటే బావుండేది కానీ ఇలాంటి పరిస్థితిల్లో ఎవరికైనా, అనుకున్నవన్నీ దొరకవు కదా అనుకుంది.

అదే సమయంలో ఆమెకు ఎవరో మాట్లాడుకోవటం వినిపించింది. అంతకు ముందు సిపాయిని పడుకోబెట్టిన చోటుకి

వచ్చేసరికి, ఎక్కణ్నుంచి వచ్చారోగాని, కొంత మంది సిపాయిలు అతని చుట్టూ గుంపుగా చేరివున్నారు. అప్పటికి కళ్ళు మూతలుపడి వున్న ఆ గాయపడిన సిపాయి వైపు చూస్తున్నారంతా.

"ఈ జపాను వాడు నీకెక్కడ దొరికాడవ్వా" అరిచారు వాళ్ళు.

"ఏ జపాను వాడు?" అంది, వాళ్ళ వైపుగా వస్తు ఆ ముసలమ్మ.

"వీడే"

"ఇతను, జపాను వాడా?" ఆశ్చర్యంగా అడిగింది తెల్లబోయి. "మరి... అచ్చు మనలాగే వున్నాడు? ఆ కళ్ళు, ఆ ఒళ్లు..."

"జపాను వాడే" గట్టిగా అన్నాడు వాళ్ళలో ఒకడు.

"అలాగా" అంది తాపీగా. "అతను ఆకాశంలోంచి పడిపోయాడు."

"ఆ రొట్టె ఇలా ఇవ్వు" మరొకడన్నాడు.

"తీసుకో. అతనికోసం ఈ ఒక్కటి తప్ప అన్నీ తీసుకోండి" అంది.

"ఒక జపాను గాడిదకు, ఇంత మంచి రొట్టె" అన్నాడు ఆ సిపాయి.

"అతనికూడా ఆకలి వేస్తుందనుకుంటాను" అంది ముసలి వాంగ్ భార్య. ఆమెకు ఈ మనుషులంటే అయిష్టత ఏర్పడ సాగింది. ఆ మాటకొస్తే, ఆమె కసలు సైనికులంటేనే గిట్టదు.

"ఇక మీరు వెళ్ళిపోతారనుకుంటాను. మా ఊరు ఎప్పుడు ప్రశాంతంగా వుంటుంది. ఇక్కడ మీకేం పని?" అంది.

"ఆఁ ఆఁ చాలా ప్రశాంతంగానే వున్నట్టు కనిపిస్తోంది, వల్లకాడులాగా. ఇదంతా ఎవరు చేశారో తెలుసా అవ్వా? జపాను వాడు"

"కావచ్చు. నేనూ అలాగే అనుకున్నాను. కానీ, ఎందుకు చేస్తున్నారో నాకు అంతు పట్టడంలేదు."

"ఇంకెందుకు, వాళ్ళకు మన భూమి కావాలి. అందుకే."

"మన భూమి... వీల్లేదు. ఎంత మాత్రమూ వీల్లేదు."

"అవును" అందరూ అరిచారు.

ఐతే, రొట్టె తింటూ ఇలా మాట్లాడుతూనే, వాళ్లు తలోవైపుగా నిలుచుని, తూర్పు దిక్కుకేసి తదేకంగా చూడ సాగారు.

"ఎందుకట్లా తూర్పు దిక్కు చూస్తోన్నారు?" అడిగింది వాంగ్ భార్య.

"అటునుండి జపాను వాళ్లు వస్తున్నారు"-ఆమె దగ్గర్నుంచి రొట్టె తీసుకున్నతను బదులిచ్చాడు.

"ఐతే, మీరు పారిపోతున్నారా?" ఆశ్చర్యంగా అడిగింది.

"మేం చాలా కొద్దిమందిమే వున్నాం. అదీకాక మేము ఒక ఊరు కాపాడాల్సి వుంది అదే, పావో ఆన్ ఊరు. అదీ" ఏదో చెప్పబోయాడతడు, పశ్చాత్తాప పడుతున్నట్టుగా.

"పావో ఆన్ నాకు తెలుసు"-అంది అతనికి మధ్యలో అడ్డు తగులుతూ వాంగ్ భార్య. "నాకా ఊరు కొత్తదేం కాదు. నా చిన్నప్పుడు అక్కడే వున్నాను. పెద్ద బజార్లో టీ కొట్టు పావో తెలుసా

మీకు? అతను మా అన్న. వాళ్ళంతా బావున్నారా?" అంది.

"అంతా పోయారు. జపాను వాళ్ళు ఆ ఊరి వారందర్నీ చంపి ఆ ఊరు ఆక్రమించుకున్నారు. సీమ తుపాకులు, మర ఫిరంగులు తీసుకుని పెద్ద పెద్ద పటాలాలు వచ్చాయి. ఇంక మేం ఏం చేయగలం చెప్పు?"

"అంతే. అంతే." ఒప్పుకుంది ఆ ముసలమ్మ. ఆమెకు బాగా అలసి పోయి నట్లుగా, చాలా భారంగా అనిపించింది. ఉన్న ఒక్క అన్నా పోయాడన్నమాట. ఇక తన పుట్టింటి వాళ్లలో మిగిలింది తనొక్కతే.

ఆ సిపాయీలు ఆమెను వదిలి వెళ్ళనారంభించారు.

"ఆ ముచ్చువెధవలు వస్తూవుంటారు. ఇంక మేం వెళ్ళిపోవటం మంచిది." అన్నారు. అంతలోనే, ఆమె దగ్గర్నించీ రొట్టె తీసుకున్నవాడు, ఆ గాయపడిన


గెలవండి - మీ తెలివి తేటలకి పని - ఎంట్రీ ఫీ లేదు

మొత్తం వెయ్యి రూపాయల బహుమతిని గెలవాలి మీరు.

| | | |
|---|---|---|
| 5 | 10 | 9 |
| 12 | 8 | 4 |
| 7 | 6 | 11 |

(మాదిరి మొత్తం 24)

| | | |
|---|---|---|
| | | |
| | 13 | |
| | | |

1. రాజ్‌దూత్ మోటార్ సైకిల్ న్యూ మోడల్ లేక టి. వి రెండవ బహుమతి.

2. వరల్డ్ సౌండ్ మార్షల్ ట్రాంసిస్టర్ హైమీడియం వేవ్ గ్యారంటీ గలది 340 రూ॥ కే. మూడవబహుమతి (3) ఆలిండియా హెవీడ్యూటీ ట్రాంసిస్టర్ 185—లేక - అమరికన్ జార్జెట్ చీర 180 రూ॥ విలువైంది.

బహుమతులు సగం ధరలకే లభిస్తాయి. నిర్ణేతలది తుదితీర్పు. ఖాళీ గళ్లలో అంకెలని ఏ వైపు ఏ మూల నించీ కూడినా మొత్తం 39 రావాలి. అంకెలని ఒక సారే వుపయోగించాలి.

బహుమతులు గెలుపొందిన వారు బహుమతుల ప్యాకింగ్ ఛార్జీలు, పోష్టల్ ఛార్జీలు భరించాలి. ఎంట్రీలని ఇంగ్లీషులోగాని, హిందీలోగాని వుండి, 70 పైసల స్టాంపులుగల పేరు ఫలితాల కోసం 40 రోజుల్లోగా పంపాలి.

**SHIVANI ENTERPRISES**
**GANDHI NAGAR-(SH—12)**
**ALIGARH-202 001.**

సిపాయి వైపుగా, కిందికి చూశాడు. అతని కళ్ళు మూసుకుని వున్నాయి. ఎలాంటి కదలికా లేదు.

"వీడు చచ్చిపోయాడా?" అడిగాడు.

వాంగ్ భార్య జవాబుచెప్పబోయేంత లోనే, విచ్చుకత్తి తీశాడు.

"చచ్చినా, బతికినా, ఒకటి రెండు పోట్లు పొడుస్తాను" అన్నాడు.

కాని ఆ ముసలమ్మ అతని చేయి దూరంగా లాగింది.

"వద్దు అతను చచ్చిపోయివుంటే, అతన్నిలా ముక్కలు ముక్కలుచేయటం మంచిది కాదు. మేం బౌద్ధులం." అది కాస్త మందలింపుగా, అధికారయుత స్వరంతో.

ఆ సిపాయి నవ్వి, "ఆఁ సరే సరే. వాడెలాగూ చచ్చాడు" అన్నాడు. అంతలో తన తోటి వాళ్ళు అప్పటికే చాలా దూరం పోయి వుండటం చూసి, వాళ్ళ వెనక పరిగెత్తాడు.

అతను జపాను వాడా? నిజంగానా? ఆ కదలిక లేని మనిషితో వదిలేయగ బడిన వాంగ్ భార్య ఆలోచించసాగింది. అతనివైపు పరీక్షగా చూసింది. చాలా చిన్న కుర్రవాడు. కళ్ళు మూసుకుని వున్నాడు. చాలా చిన్న వయసు. లేత మొహం. నాడి చూసింది. కొట్టుకుంటు న్నట్టు లేదు. అతని మొఖం దగ్గరికి వంగి, తాను తినకుండా దాచిన రొట్టె ముక్క నోటి దగ్గర పెట్టింది.

"తిను" గట్టిగా, స్పష్టంగా అంది.

"రొట్టె తెచ్చాను" మళ్ళీ అంది.


ఏమీ బదులు రాలేదు. ఖచ్చితంగా అతను చచ్చిపోయాడు. తను రొట్టెతీసుకు రావడానికి వెళ్ళినప్పుడే అతను చచ్చి పోయివుండాలి.

ఇక చేసేదేమీ లేదు. ఆ రొట్టె తనే తినటం తప్ప. ఆ పని పూర్తిచేశాక, తను చిన్న పిగ్‌తో కలిసి ఊరి వాళ్ళ లాగా పారిపోనందుకు ఆమెకు కాస్త ఆశ్చర్యం వేసింది. సూర్యుడు క్రమ క్రమంగా ఆకాశం లోకి ఎగబాకుతున్న కొద్దీ, వేడి తీవ్రత ఎక్కువవుతూంది. వాళ్ళతోపాటు పోయి వుంటే బావుండేది సరే, ముందు కట్టపైకెక్కి ఎటు వెళితే బావుంటుందో చూసుకోవాలి. వాళ్ళు పడమరవైపు వెళ్ళారు. కానీ, తను చూపు మేరలో అవైపు అంతా శూన్యంగా కనిపిస్తూంది. కట్ట పైకెక్కితేనే ఆ పక్క ఊరు కనిపిస్తుంది. బహుశా వాళ్ళంతా అక్కడే వుండి వుంటారు.

ఇక మెల్లగా కట్టపై కెక్కడం ప్రారంభించింది. పైన కాస్త చల్లగా వుండి, హాయిగా అనిపించింది. కానీ అంతలోనే కట్టకు దాదాపు పైదాకా వచ్చిన నదిని చూడగానే దిగ్భ్రాంతి కలి గింది. మరుక్షణంలో ఎందుకలా పెరి గింది!

"ఛూ! ముసలి రాక్షసి" కోపంగా అరిచింది. నీని దేవుడికి వినిపిస్తే వినిపిం చని. అలా కష్టాల్లో వున్నప్పుడు వరద లతో భయపెట్టజూచేవాడు దేవుడుకాదు రాక్షసుడే.

చేతులూ, ముఖమూ కడుక్కుంది. నీళ్ళతో. ఎక్కడో అప్పుడే కురిసిన వర్షం నీళ్లు కలిసినట్టుగా నీళ్లు చల్లగా



వున్నాయి. లేచి నిలబడి చుట్టూ చూసింది. దూరంగా పడమరన, పక్కఊరి పొలిమేర, అటువైపు పరుగెడుతున్న ఇంతకుముందు సిపాయిలూ కనిపించారు. తనూ ఆ ఊరికి వెళ్ళటం మంచిది చిన్నపిగ్, వాడి భార్యా తన కోసం వేచిచూస్తు వుంటారక్కడ!

ఇక కట్ట పైనుండి కిందకు దిగే ప్రయత్నంలో ఉండగా, తూర్పు దిక్కుగా దూరంగా ఏదో కనిపించింది. ముదుగా అంతా దట్టంగా పేరుకున్న ధూళి పైకి లేచి చిక్కగా మబ్బుల్లా తోచింది. కానీ దానివైపు కాస్సేపు పరిశీలనగా చూసేటప్పటికి, నల్ల చీమల్లాగా, మధ్యలో మెరుస్తున్న వెండి రవ్వల్లాగా ఏదో అస్పష్టంగా తోచింది. మరుక్షణంలో అదేమిటో బోధపడింది. అది పెద్ద జన సమూహం, సైనికుల పటాలం. ఏ సైన్యమో తనకు తెలుసు.

"వాళ్ళే జపానువాళ్ళు" అనుకుంది. అవును, ఖచ్చితంగా. వాళ్ళ మీదుగా వెండి గాలిమోటార్లు ఎగురుకుంటూ వస్తున్నాయి. అంతా ఎవరికోసమో వెతుకుతున్నట్టనిపించింది" నా కోసమో, చిన్నపిగ్, వాడి భార్యకోసమో కాకపోతే మీరు ఎవరికోసం వెతుకుతున్నట్టు? మా అన్న పావోను ఎప్పుడో మీ పొట్టన పెట్టుకుంటిరి" - గొణుక్కుంది తనలో తనే.

తన అన్న చచ్చిపోయిన విషయం అసలు మరిచే పోయింది. ఇప్పుడు గుర్తొచ్చింది. ఎంత మంచి దుకాణమో వాడిది! ఎప్పుడూ శుభ్రంగా ఉంచేవాడు. ఎప్పుడూ మంచి టీ, మంచి మాంసం వున్నా ధర మాత్రం ఒకే రకంగా వుండేది. పావో పెద్దమనిషి, మంచి వాడు. వాడు కాక వాడి భార్య, పిల్లలూ ఏమయ్యారో... అనుమానం లేదు,

ాళ్ళను కూడా చంపే వుంటారు.
ప్పుడు, ఈ జపాను వాళ్లు, తన కోసం
హస్తున్నారు. ఇలా ఆలోచిస్తూ కట్ట
ంద వుంటే తను వాళ్ళకు సులభంగా
నిపిస్తుందని తోచి, త్వరత్వరగా
ందకు దిగింది.


అలా దిగుతూనే కట్టకున్న సీటి
ద్వారం గురించి ఆలోచించింది. మొద
ట్నుంచీ, ఈ ముసలినది తమకు శాపం
నే వుంటూ వచ్చింది. ఇప్పుడు కూడా
ు క్కి పొలాల్ని దోచుకోవాలనే
గాస్తూంది. అది చేసిన ఘోరాలకి ఇన్నిటికీ
ది ప్రాయశ్చిత్తం ఎందుకు చేసుకో
నాదదు! అవును, ఎందుకూడదు?
ంచెం సేపు ఆలోచనల్లో ఊగిసలా
ంది. ఆ పడుచు జపాను కుర్రాడు వర
లో కొట్టుకు పోతాడేమో, పాపం.
గాడ ముచ్చటగా వున్నాడు. వాణ్ని
నే కత్తిపోటు తినకుండా కాపాడింది.
ందువల్ల తను వాణ్ని కాపాడలేక
యినా, ఒకవేళ ప్రాణాలతో వున్నట్టి
ంతే, తన పని అతనికి ఉపకారమే
య్యేది. ఒడ్డుకు ఎత్తుగా లాగింది
కుర్రాణ్ని. మళ్ళీ కిందికి వచ్చింది.

గట్టు తెరవడం తనకు బాగా తెలుసు
మాటకొస్తే, పొలాసికి నీరు పెట్టాల్సి
ంతవరకూ ఆపని చిన్న పిల్లాడికూడా
లుసు. కానీ తనకు మొత్తం గండితెర
ం తెలుసు. కానీ తెరిచిన తరువాత
ను తప్పించుకునే సమయం వుంటుందా
అన్నదే ప్రశ్న.

"కాటికి కళ్ళు చాచుకున్న ముసలి దాన్ని నేను" తనలో తనే అనుకుంది. ఆ ఒక క్షణం సేపు ఆగింది. చిన్న పిగ్ భార్య ఏ బిడ్డను ప్రసవిస్తుందో చూడకుండానే పోవడం దురదృష్టమే కానీ, అన్నీ చూడటం ఎవరికీ సాధ్యం కాదు కదా. తన జీవితంలో ఎన్నో చూసింది తను. ఏమైనా ఒక మనిషి అనుభవించదగిన జీవితానికి ఎక్కడో ఒక చోట ముగింపు తప్పదు. తను ఇలాంటి ఘట్టంలోనే వుంది.

మళ్ళీ ఓసారి తూర్పువైపు చూసింది. మైదానంలోంచి వస్తున్నారు జపానువాళ్లు. మిణుకు మిణుకుమని మెరుస్తున్న వెలుగులతో నల్ల చీమల బారులా వేలాది మంది వస్తున్నారు. తను ఈ కట్ట తెరిస్తే, ఉధృతమైన ప్రవాహం పొంగిపొర్లి వాళ్ళందర్నీ కొట్టుకు పోతుంది. ఇక, వాళ్ళు తనవైపు గాని నీ, తన కోసం చూస్తున్న చిన్నపిగ్, వాడి భార్య వైపుగానీ రాలేరు. తన గురించి తనవాళ్ళు తెల్లబోతారు. కానీ, ఇలా జరిగి వుంటుందని ఊహించలేరు. ఈ విషయం మంచి కథ అవుతుంది. తను బ్రతికితే అది చెప్పుకుంటూ ఆనందించవచ్చు.

ఒక నిశ్చయానికి వచ్చేసి కట్టద్వారం వైపు తిరిగింది ముసలివాంగ్ భార్య. కొందరు గాలి మోటార్లతో యుద్ధము చేస్తారు, కొందరు తుపాకులతో




యుద్ధం చేస్తరు, కానీ, ఇలాంటి కసాయి నది సాయంతో కూడా యుద్ధం చేయవచ్చు. ఇక కట్టకు గండి పెట్టడానికి ఉపక్రమించింది. ఒక కర్రదుంగను బైటకి లాగింది. పచ్చగా పాచి పట్టివుంది- దాన్ని లాగీ లాగటంతోనే నీళ్ళు బైయటకి దూకాయి. తను ఇంకొక్క దుంగలాగితే చాలు, మిగతా వి వాటంతటవే వచ్చేస్తాయి. ఇక ఆ నదిని ఆపటం ఎవరి వల్లాకాదు. మరోదాన్ని లాగటం మొదలెట్టి, కొంచెం లాగింది.

ఇంతటితో ఏ కర్మకాండ, పరిశుద్ధి పూజలూ అవసరంలేకుండానే పోతాను నా ముసలాయన్ని కలుసుకోవచ్చు కూడా. ఈకట్టనుండి పొలాలకు నీరు పెట్టడం, చిన్న గండి పడినప్పుడు దాన్ని మూయటము -ఇలాంటి పనులన్నీ ఆయన ఎంత బాగా చేసేవాడో! ఇక... అను కుంటుండాగా, ఆ కర్రదుంగ ఒక్కసారిగా బైటికి ఊడి పడింది. నది ప్రవాహం బైటికి దూకింది. కట్ట తెగింది. ఆ ముసలమ్మని ముంచెత్తేసింది.

"రా, ముసలి రాక్షసీ" అంటూనే, ఆమె అంతిమ శ్వాస వదిలింది. ఉవ్వెత్తున ఎగిసిన నీటితో ఆకాశంలోకి లేచింది ఆముసలి వాంగ్. ఆమెకుకిందా, పైనా, ఆపక్కనా ఈ పక్కనా - చుట్టూ నీళ్ళే. తిరిగే సుళ్ళతో ఆమెను గిరిగిరా తిప్పి, ఆ ప్రవాహం వస్తున్న శత్రువుల వైపు పరిగెత్తసాగింది, తూర్పుదిశగా *